Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 306
పేజీలు : 3

బుధవారం 0.06.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



## ఈఎన్‌సీ మోహన్‌నాయక్

- ఇంట్లో రూ.200 కోట్ల ఆస్తులు





**టీ మీడియా, జూన్ 9 , హైదరాబాద్ :**
ఆర్అండ్‌బీ (రోడ్లు భవనాల శాఖ) ఈఎన్‌సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) మోహన్ నాయక్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టారని తెలిసిందే. మంగళవారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. మియాపూర్ పరిసర ప్రాంతాల్లోని 11 చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగించిన ఏసీబీ అధికారులు పలు కీలక డాక్యుమెంట్లు, నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు.కాగా ఈ తనిఖీల్లో మోహన్‌నాయక్‌కు రూ.200 కోట్ల ఆస్తులు గుర్తించారు. మోహన్‌నాయక్ ఇంట్లో రూ.60 లక్షల నగదుతో పాటు రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు గుర్తించారు. మోహన్‌నాయక్‌కు హైదరాబాద్‌లో పలు ప్లాట్లు, నిజామాబాద్‌లో వ్యవసాయ భూమి, అత్యంత ఖరీదైన విల్లాతో, అపార్ట్‌మెంట్, ఖాళీ స్థలాలు, ఫామ్ హౌజ్‌లు, విల్లాలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.హైదరాబాద్ వార్తలురోడ్ల నిర్మాణాలకు సంబంధించిన టెండర్లలో కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించే ప్రక్రియలో అక్రమాలు చేసినట్టుగా మోహన్ నాయక్‌పై గతంలో ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది





## ఇందిరమ్మ రాజ్యం వస్తేనే
# మహిళలకు గుర్తింపు

- స్వయం సహాయక బృందాలకు బస్సులు పంపిణీ
- జెండా ఊపి ప్రారంభించిన సీఎం

**టీ మీడియా, జూన్ 9 , హైదరాబాద్:** మన సంస్కృతి, సంప్రదాయంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి మహిళాశక్తిని ప్రపంచానికి చాటిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని తెలిపారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేశారు. జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. అనంతరం సికింద్రాబాద్? పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో పాల్గొని రేవంత్? రెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుందని అన్నారు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని పేర్కొన్నారు.

### స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు

అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారని, వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలని, ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనదని కొనియాడారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన చేస్తున్నామని అన్నారు. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టిందని, భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకి దక్కుతుందని తెలిపారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తు చేశారు.మహిళలకు రిజర్వేషన్ల బిల్లు : బీజేపీ పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లకు 2013లో సోనియాగాంధీ బిల్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.

### ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం


ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు ఉంటుందని, గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును చెల్లించలేదని, మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు.

### మహిళలను కోటీశ్వరులను చేస్తాం

ఆడబిడ్డలు ఉచితంగా బస్సులో పక్క ఊరు వెళ్లి చదువుకుంటున్నారని, ఫ్రీ బస్సు వల్ల స్కూళ్లల్లో ఆడపిల్లల డ్రాపవుట్లు తగ్గాయని తెలిపారు. అంబానీ, అదానీలకు పోటీగా పెట్రోల్ బంక్‌లు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని, హైటెక్‌సిటీ పక్కన రూ. వెయ్యి కోట్ల భూమిని మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి మహిళల చేతిలో ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలను ఏనాడైనా మహిళలు కట్టుకున్నారా? అని అడిగారు. తమ ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకుని మహిళలు ఈ సభకు వచ్చారని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు.

## మృతుల కుటుంబాలకు
# రూ.25 లక్షలు
## చొప్పున పరిహారం

- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**టి మీడియా ,జూన్ 9 ,విశాఖ :**
విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అత్యవసర చికిత్స పొందుతున్న బాధితులను విశాఖ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. ముగ్గురు బాధితులను, వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఘటన జరిగినప్పుడు షిఫ్ట్‌లో ఎంతమంది ఉన్నారని ఆరా తీశారు. ప్రమాదానికి గల కారణాలను, ఆ సమయంలో అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై కిమ్స్ ఆసుపత్రి మేనేజ్‌మెంట్, నిపుణులైన వైద్య బృందంతో పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సమీక్షించారు. బాధితులకు ఎలాంటి లోటు లేకుండా అత్యుత్తమ, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని బాధితులకు పవన్‌కల్యాణ్ భరోసా ఇచ్చారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ఘోర ప్రమాదంలో 8 మంది కార్మికులు మృతి చెందడం బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన మరో ఆరుగురికి ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన మంగళవారం విశాఖకు చేరుకుని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. బాధితుల కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ "ప్రమాద తీవ్రతపై ఆరా తీశా. ప్రపంచంలో ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగాయా అని అడిగితే లేదన్నారు. చైనా, ఫ్రాన్స్ దేశాల్లో గతంలో ప్లాంట్ ప్రమాదాలు జరిగాయి గానీ, ఈ తరహా దుర్ఘటన ఎక్కడా జరగలేదని తెలిసింది. ప్రమాదానికి గల కారణాలపై ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని వేసింది. ఈ కమిటీ లోతుగా విచారణ జరిపి అన్ని వివరాలను రాబడుతుంది" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

### పరిహారం ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్

విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనలో గాయపడి కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పవన్ భరోసా ఇచ్చారు. ప్రమాదంలో 8 మంది చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. మరణించిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్నారు. రిటైర్‌మెంట్ వరకు స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్‌లోనే ఉండొచ్చని చెప్పారు.

### ప్రభుత రంగంలోనే స్టీల్ ప్లాంట్

"స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకూడదనేదే కూటమి ప్రభుత్వ ప్రధాన సంకల్పం. ఇది ప్రభుత్వ స్టీల్ ప్లాంట్‌గానే కొనసాగాలనేది అందరి ఆకాంక్ష. ప్రజలు, కార్మికుల కోరిక ప్రకారమే దీనిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తాం. ఈ విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదు" అని పవన్ స్పష్టం చేశారు.

### కార్మికులతో ప్రత్యేక సమావేశం

ప్రమాదానికి గల కారణాలను కేవలం ఒకే కోణంలో కాకుండా అన్ని వైపుల నుంచి వివరాలు సేకరిస్తేనే అసలు నిజాలు తెలుస్తాయన్నారు. ప్లాంట్‌లో రక్షణ చర్యల పట్ల యాజమాన్యం తీరు ఎలా ఉందో పూర్తిగా తెలుసుకోవాల్సి ఉందన్నారు. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు బాధపడటం సరికాదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాజమాన్యం బాధ్యతగా ఉండాలని పవన్ కల్యాణ్ హెచ్చరించారు.ప్రస్తుతం ప్లాంట్‌లో పరిస్థితులన్నీ సద్దుమణిగాక, కార్మికులతో ప్రత్యేకంగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని అన్నారు. కార్మికులకు ఉన్న అన్ని సమస్యలపై చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నానన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా కార్మికుల పక్షాన కార్మిక సంఘాలు రక్షణ కవచంలా ఉండాలని పవన్ అన్నారు. కమిటీ నివేదిక వచ్చిన తర్వాత తదుపరి కఠిన నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.

## దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- తెలంగాణకు చెందిన ముగ్గురు మృతి



**టీ మీడియా, జూన్ 9 , హైదరాబాద్ :**
దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మినీ బస్సు, ట్రక్కు ఢీ కొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులతో పాటు మరో నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే..దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై సోమవారం వేగంగా వస్తున్న మినీబస్సు ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. మృతులను జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రఫీక్, కొడిమ్యాల మండలానికి చెందిన సయ్యద్ సలీం, మల్యాల మండలానికి చెందిన గజుల తిరుపతిగా గుర్తించారు.హైదరాబాద్ వార్తలుగాయపడిన వారిలో హైదరాబాద్ నగరానికి చెందిన మహమ్మద్ సయీద్ కూడా ఉన్నాడు. వీరందరూ షార్జా కేంద్రంగా పని చేస్తున్న అల్యూమినియం గ్లాస్, డోర్ ఫ్రేమ్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న భారత కాన్సులేట్ అధికారులు బాధితులను పరామర్శించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## లక్ష డాలర్ల హెచ్-1బీ ఫీజును కొట్టేసిన ఫెడరల్ కోర్టు

3లో..




# విచ్చలవిడి బెల్ట్ షాపులతో యువత భవిష్యత్తు చిత్తు

- నిద్ర వ్యవస్థలో ఎక్సైజ్ శాఖ

**టీ మీడియా, జూన్ 9, వనపర్తి బ్యూరో :**

వనపర్తి పట్టణంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగి పోతున్నాయి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిత్యం మద్యం అమ్ముతున్నారు. నేటి యువత సరదాగా, ఒత్తిడిని తట్టుకోలేక లేదా స్నేహితుల ఒత్తిడి వల్ల మత్తు పదార్థాలకు, మద్యానికి బానిసవుతున్నారు. ఇది వారి బంగారు భవిష్యత్తును, ఆరోగ్యాన్ని నాశనం చేయడమే కాక, కుటుంబాలను తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురిచేస్తోంది. కిరాణా దురాణాలు, చిన్న చిన్న వ్యాపార కేంద్రాలు బెల్ట్ షాపులుగా మారిపోవడంతో ప్రజలు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా మద్యం దుకాణాలకే అనుమతి ఇచ్చినప్పటికీ, వార్డులలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానిక కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. వార్డులలో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపులు తెరిచి ఉంచి మద్యం విక్రయాలు చేస్తున్నట్లు తెలిసిన నిద్ర వ్యవస్థలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు ఉన్నారు. దీంతో యువత మద్యానికి బానిసలవుతూ కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని పెద్దలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులకు వెళ్లే కార్మికులు సంపాదించిన డబ్బులో అధిక భాగం మద్యానికే ఖర్చు చేయాల్సి వస్తోందని పట్టణ ప్రజలు చెబుతున్నారు. యువతను కుశిస్తున్న మద్యం వార్డులలో సులభంగా మద్యం అందుబాటులో ఉండటంతో యువత, విద్యార్థులు సైతం మద్యం వైపు ఆకర్షితులవు తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల సమీప ప్రాంతాల్లో కూడా కొందరు అక్రమంగా







మద్యం విక్రయాలు చేస్తున్నట్లు అరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బెల్ట్ షాపుల కారణంగా కాలనీలో కుటుంబ కలహాలు, గృహ హింస సంఘటనలు పెరుగుతున్నాయని మహిళలు చెబుతున్నారు. మద్యం సేవించి ఇంటికి వచ్చే భర్తలు భార్యాభర్తల మధ్య గొడవలకు కారణం మవుతున్నారని, పిల్లల చదువులపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు లేదని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టాలకు తూట్లు అక్రమంగా మద్యం విక్రయాలు జరపడం చట్టరీత్యానేరమైనప్పటికీ కొందరు వ్యాపారులు లాభాల కోసం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెల్ట్ షాపులపై అప్పుడప్పుడు దాడులు జరుగుతున్నప్పటికీ, కొద్ది రోజులకే మళ్లీ యథావిధిగా విక్రయాలు కొనసాగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల చర్యలు ఎప్పుడు? పట్టణ వ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ, పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వార్డులలో అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించాలని, యువతను మద్యం వ్యసనం నుంచి కాపాడాలని మహిళా సంఘాలు, పెద్దలు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీలలో బెల్ట్ షాపుల నిర్మూలనతోనే యువత భవిష్యత్తు భద్రంగా ఉంటుందని, కుటుంబాలు సంతోషంగా జీవించే పరిస్థితులు నెలకొంటాయని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తరచూ మద్యం లేదా మత్తుపదార్థాలు తీసుకోవడం వల్ల మెదడులో డోపమైన్ స్థాయిలు పెరిగి, వాటికి మానసికంగా, శారీరకంగా బానిసలుగా మారుతారు. ఎక్కువగా మద్యం సేవించడం వల్ల నిర్ణయాత్మక శక్తిని కోల్పోవడం, చదువు/కెరీర్ దెబ్బతినడం, లివర్, మెదడు సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులు రావడం జరుగుతుంది. వ్యసనం నుంచి బయటపడటానికి కౌన్సెలింగ్, డి-అడిక్షన్ సెంటర్లు, డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.



## ధాన్యం మిల్లులు, గోదాములు తనిఖీ చేసిన కలెక్టర్

**టీ మీడియా, జూన్ 9 ,పెబ్బేరు:**

వనపర్తి జిల్లా పెబ్బేరు ఉమ్మడి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ గోదాములు మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని శ్రీరంగాపురం మండల పరిధిలోని లక్ష్మి వారాహి ఇండస్ట్రీ పెబ్బేరు పరిధిలో రాధాకృష్ణ ఇండస్ట్రీస్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఆయా మిల్లుల గోదాముల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో వేగంగా దించుకోవాలని స్పష్టం చేశారు లారీలలో ఉన్న ధాన్యం పై టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు త్వరగా దింపుటకు గాను హమాలీ కార్మికుల సంఖ్యను పెంచుకోవాలని మిల్లర్లకు చెప్పారు మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్ లోడ్ చేస్తూ రోజువారీ అన్ లోడ్ సామర్థ్యాన్ని పెంచాలని ఎక్కడా లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని అధికారులను మిల్లర్లను ఆదేశించారు ఇంకా ధాన్యం నిల్వ చేయడానికి గోదాములను సిద్ధం చేయాలని పౌర సరఫరాల అధికారికి సూచించారు జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ రెవెన్యూ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



# ఏఓబీలో మావోయిస్టుల డంప్ స్వాధీనం

- సమాచారం ఆధారంగా గుర్తించిన పోలీసులు

**టి మీడియా ,జూన్ 9 , మల్కన్‌గిరి :**

ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను ఒడిశా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా పోలీసులకు అందిన కచ్చితమైన సమాచారం ఆధారంగా మల్కన్‌గిరి జిల్లా మతిలి పోలీస్ స్టేషన్ పరిధిలో బీఎస్ఎఫ్, డీవోజీ బలగాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలను చేపట్టారు. ఈ సందర్భంగా మతిలి పోలీసు స్టేషన్ పరిధిలో కిర్మిట్టి, కటువాపదర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఈ డంప్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆపై మల్కన్‌గిరి జిల్లా పోలీసు కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసులు దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ డంప్‌లో ఇన్సాస్ ఎల్ఎంజీ, ఇన్సాస్ రైఫిల్, మూడు ఐఈడీల తో పాటు భారీ ఎత్తున పేలుడు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు మల్కన్?గిరి జిల్లా పోలీసులు తెలిపారు. సుదీర్ఘ విరామం తరువాత మావోయిస్టులు డంప్ పోలీసులకు దొరకడంతో సరిహద్దుల్లో ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

# ఊహించిన రీతిలో ఎదురైన మరణం

- వీకాఫ్ క్యాన్సిల్ చేసుకుని ఒకరు
- షిఫ్ట్ మార్చుకొని మరొకరు

**టి మీడియా ,జూన్ 9 ,విశాఖ :**

వీకాఫ్ క్యాన్సిల్ చేసుకుని ఒకరు. షిఫ్ట్ మార్చుకుని మరొకరు. ఇలా డ్యూటీకి వచ్చిన ఇద్దరు వ్యక్తులు విశాఖ ఉక్కు పరిశ్రమలో జరిగిన ఉపద్రవానికి బలైపోయారు. దీంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. మరోవైపు 20 ఏళ్లుగా స్టీల్ ప్లాంట్‌లో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్న మరో వ్యక్తి ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు.

అగనంపూడి పరిధి దొంకాడ పునరావాస కాలనీకి చెందిన నక్కరాజు అప్పలరాజు ఎస్ఎంఎస్-1 విభాగంలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్నాడు. సోమవారం ఆయనది వారాంతపు సెలవు. సిబ్బంది కొరత ఉండడంతో విధులకు హాజరవ్వాలని అధికారులు కోరారు. దీంతో డ్యూటీకి వెళ్లి ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడికి భార్య మణి, కుమారుడు దేవి వరప్రసాద్, కుమార్తె హేమశ్రీ ఉన్నారు.





**షిఫ్ట్ మార్చుకొని వెళ్లగా**

అగనంపూడిలోని శనివాడ కాలనీకి చెందిన గొంతిన భానుకుమార్ ఎస్ఎంఎస్-1లో టెక్నీషియన్. ఇతను సోమవారం సి షిఫ్టులో హాజరుకావాల్సి ఉంది. మరో ఉద్యోగితో మాట్లాడుకొని బి షిఫ్టులో వెళ్లాడు. ఊహించని విధంగా ప్రమాదంలో చనిపోయాడు. భానుకుమార్‌కు లావణ్యతో రెండేళ్ల క్రితమే వివాహం జరిగింది. వారికి నాలుగు నెలల కుమారుడు ఉన్నాడు. విశాఖ జిల్లా పెదగంట్యాడ రూరల్ మండలం జీవీఎంసీ 77వ వార్డు పరిధి మదీనాబాగ్ సమీప సత్తార్ కాలనీకి చెందిన నక్కా వెంకటరమణ స్వగ్రామం నక్కపల్లి. 30 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం మదీనాబాగ్ వచ్చి స్థిరపడ్డారు. 20 ఏళ్లుగా స్టీల్ ప్లాంట్‌లో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్నారు. బి షిఫ్టులో విధులకు వెళ్లిన వెంకటరమణ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**అసలేం జరిగిందంటే?**

విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం స్టీల్? ప్లాంట్?లోని ఎస్?ఎంఎస్?-2, ఎస్?టీసీ-3 హీట్ ఎఫ్?జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ పేలడంతో ఉక్కు ద్రవం లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 8 మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1,500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కు ద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం సంభవించడంతో భయాందోళనకు గురైన కార్మికులు, ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నించారు. మృతులు ఉక్కు నగరానికి చెందిన మేనేజర్ గోల్డ్‌కుమార్, స్లైడ్ ఆపరేటర్ జి.వి. అప్పారావు, గాజువాకకు చెందిన స్టాండ్-3 కె.ప్రభాకరరావు, అగనంపూడికి చెందిన షిఫ్ట్ చేంజ్, స్టాండ్-1 గొంతెన భానుకుమార్, కాకానినగర్‌కు చెందిన సీపీఎం, స్టాండ్-4 ఎం.కృష్ణ నాగు, ఇస్లాంపేటకు చెందిన ఒప్పంద కార్మికుడు నక్కా వెంకటరమణ, అప్పన్న కాలనీకి చెందిన ఒప్పంద కార్మికుడు త్రినాథ్, ఒప్పంద కార్మికుడు నక్కరాజు అప్పలరాజుగా గుర్తించారు.

## అబద్ధాల కాంగ్రెస్ పాలన ఆగం కాక తప్పదు

- నందిమల్ల.అశోక్

**టీ మీడియా, జూన్ 9, వనపర్తి బ్యూరో**



మహిళలను కోటీశ్వరులను చేయడం దేవుడెరుగు?మహిళలకు ఇస్తామన్న 2500 ఇవ్వండి. ఇందిరా మహిళా శక్తి కింద 400 బస్సులు అనేది మహిళలను మోసం చేయడమే. అబద్ధాల పాలన ఆగం కాక తప్పదు అనినందిమల్ల. అశోక్జిల్లా మీడియా కన్వీనర్ అరోపించారు. వనపర్తి డిపోకు చెందిన బస్సులకు అలంపూర్ మహిళా సమాఖ్య అని పేర్లు స్టిక్కర్లు వేసి చూయించడం రేవంత్ రెడ్డి పాలనకు పరాకాష్ట నిజంగా మహిళలకు బస్సులు కేటాయించి ఆర్థికంగా అభివృద్ధి చేయాలనుకుంటే నూతన బస్సులు కొనుగోలు చేసి వారికి కేటాయించాలని అశోక్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు నీలస్వామి,మైనార్టీ సెల్ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్,మండల యువత అధ్యక్షులు చిట్యాల.రాము ఉన్నారు.

## అగ్నికి ఆహుతి ఐన డ్రాగన్ తోట

**టీ మీడియా, జూన్ 9 ,పెబ్బేరు:**



పెబ్బేరు ఉమ్మడి మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన అంకె బాలయ్య తన వ్యవసాయ పొలంలోఒకటిన్నర ఏకరా విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు అకస్మాత్తుగా తోటలో మంటలు ఎలా వ్యాపించాయో తెలియదు కానీ పొలంలో గడ్డికి మంటలు వ్యాపించి తోటంతా దెబ్బతిని నష్టం వాటిల్లడంతో రైతు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు దాదాపు 10 లక్షల దాకా పంటపై పెట్టుబడి పెట్టి ఒక్కసారిగా దగ్ధం కావడంతో బోరున విలపిస్తున్నారు ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు కుటుంబ సభ్యులు గ్రామస్తులు కోరారు.

## సమస్యల పరిష్కారమే ఎస్టియు లక్ష్యం

నరసింహనాయుడు



**టీ మీడియా, జూన్ 9, వనపర్తి బ్యూరో :** విద్యా, ఉపాధ్యాయ రంగంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్టేట్ టీచర్స్ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు రసింహ నాయుడు పేర్కొన్నారు. ఎస్టియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా సంఘ కార్యాలయంలో ఆయన ఘనంగా పతాకావిష్కరణ చేశారు. ?ఈ సందర్భంగా నరసింహనాయుడు మాట్లాడుతూ..యూనియన్ నేటితో 80 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ 80 సంవత్సరాల ప్రస్థానంలో ఎంతో మంది నిబద్ధత కలిగిన నాయకులు, కార్యకర్తలు తమ రక్తాన్ని ధారపోసి సంఘాన్ని బలోపేతం చేశారన్నారు. భవిష్యత్తు లోనూ అదే స్ఫూర్తితో ఉపాధ్యాయ సంక్షేమం, విద్యా నాణ్యత పెంపు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యాలుగా ముందుకు సాగుతామని ఆయన పిలుపునిచ్చారు. ?ఈ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో ఎస్టియు టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. హరిప్రసాద్, పూర్వ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎస్ టి యు ముఖ్య నాయకులు ఎండి. మైనరుద్దీన్, కె. ఈశ్వర్ గౌడ్, జి. వెంకటేశ్వర్ రెడ్డి, కే. రామచందర్, వెంకటేష్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, శివశంకర్, సత్యనారాయణ తదితర ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో జోరు వాన..

- పలు ప్రాంతాల్లో స్తంభించిన రాకపోకలు

**టీ మీడియా, జూన్ 9 , హైదరాబాద్ :**



చాలా ప్రాంతాలను ఇప్పటికే తొలకరి వర్షం పలుకరించిందని తెలిసిందే. తాజాగా హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా చల్ల బడ్డది. నగరవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కుండపోత వర్షం ధాటికినగరంలోని అమీన్‌పూర్, రాయ్‌దుర్గ్, ఖైరతాబాద్, కూకట్ పల్లి, లింగంపల్లి, మియాపూర్, ముషీరాబాద్, లక్డీకాపూర్, సరూర్ నగర్, కోఠి, అబిడ్స్, బషీర్ బాగ్, హిమాయత్ నగర్, ట్యాంక్ బండ్, నారాయణగూడతోపాటు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షంతో కొన్ని చోట్ల ట్రాఫిక్ స్తంభించి రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు వాహన రద్దీని క్లియర్ చేస్తున్నారు. ముషీరాబాద్‌లో ఈదురుగాలుల ధాటికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రామ్ నగర్‌లోని వీఎస్టీ రోడ్డులో భారీ వృక్షం నేలకొరిగింది. మరోవైపు హైదర్‌గూడలో మరో వృక్షం నేలకొరిగింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలుజిల్లాల్లో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# వంటగ్యాస్ రాయితీకి కత్తెర

- నాలుగు సిలిండర్లకే సబ్సిడీ

**టి మీడియా ,జూన్ 8 , ఢిల్లీ బ్యూరో :**

ఎన్డీయే ప్రభుత్వ హయాంలో పేద, మధ్యతరగతి ప్రజలకు మళ్లీ కట్టెల పొయ్యే దిక్కయ్యేలా కనిపిస్తున్నది. పశ్చిమాసియా ఉద్రిక్తతల పేరిట ఇప్పటికే వంటగ్యాస్ సిలిండర్ల ధరలను దఫాలుగా పెంచుతున్న కేంద్రం.. ఇప్పుడు ఉజ్వల యోజన కింద పేదింటి మహిళలకు ఇచ్చే సిలిండర్ల సంఖ్యలోనూ భారీగా కోత విధించింది. ఈ విషయాన్ని ఆయిల్ కంపెనీలు వెల్లడించాయి. హైదరాబాద్ వార్తలు



**కోత ఇలా..**

గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల సిలిండర్ ధర ప్రస్తుతం హైదరాబాద్‌లో రూ. 994గా ఉన్నది. అయితే, పేదింటి మహిళలపై ఆర్థిక భారం తగ్గించడంలో భాగంగా ప్రభుత్వం ఉజ్వల యోజన కింద ఒక్కో సిలిండర్‌పై రూ. 300 మేర సబ్సిడీ అందిస్తున్నది. దీంతో ఉజ్వల స్కీమ్‌లోని మహిళలకు ఒక్కో సిలిండర్ రూ. 694కే లభిస్తున్నది. అయితే, ఈ స్కీమ్ కింద ఇప్పటివరకూ ఏడాదికి 9 సిలిండర్ల వరకూ తీసుకొనే వెసులుబాటు ఉండేది. అయితే, తాజా కోతలను అనుసరించి ఏడాదిలో 4 సిలిండర్లకు మాత్రమే ఈ సబ్సిడీ వర్తిస్తుందని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఐదో సిలిండర్ కావాలంటే మొత్తం ధర అంటే రూ. 994 చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి. తాజా తెలుగు వార్తలు

**ఒక్కో కుటుంబంపై రూ. 1500 భారం**

ఉజ్వల స్కీమ్‌లో భాగంగా గతంలో ఏడాదికి 9 సిలిండర్లకు రూ. 300 చొప్పున సబ్సిడీ వర్తించేది. దీంతో ఒక్కో సిలిండర్‌కు రూ. 694 మాత్రమే చెల్లించేవారు. అలా ఏడాదికి ఒక్కో పేద కుటుంబానికి రూ. 2,700 మేర ఆదా అయ్యేది. అయితే, తాజాగా సబ్సిడీ లిమిట్‌ను 4 సిలిండర్లకే పరిమితం చేయడంతో మిగతా ఐదు సిలిండర్లకు పూర్తి మొత్తం అంటే రూ. 994 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఉజ్వల స్కీమ్ పరిధిలోకి వచ్చే ఒక్కో కుటుంబం ఏడాదికి రూ. 1,500 మేర అదనంగా చెల్లించాల్సి వస్తున్నదని పలువురు వాపోతున్నారు. రాయితీకి కత్తెరేసిన కేంద్రం చర్యలతో పేదోడి బడ్జెట్ తలకిందులయ్యిందని విమర్శిస్తున్నారు.

**ఏటా కేంద్రానికి రూ. 15,855 కోట్లు**

కిందటి నెల నాటికి ఉజ్వల స్కీమ్ కింద 10.57 కోట్ల మంది లబ్ధిదారులుగా ఉన్నట్టు కేంద్రప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. తాజా నిర్ణయంతో ఉజ్వల స్కీమ్ పరిధిలోకి వచ్చే ఒక్కో కుటుంబంపై ఏటా పడే రూ. 1,500 అదనపు భారాన్ని లెక్కలోకి తీసుకొంటే, ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ. 15,855 కోట్లు అదనంగా చేకూరనున్నట్టు ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

**తొలుత 12.. ఇప్పుడు 4**

2016లో ఉజ్వల స్కీమ్ ప్రారంభించారు. అప్పుడు ఏడాదికి 12 సిలిండర్లకు రాయితీని ఇచ్చేవారు. అయితే, గత ఏడాది ఆగస్టులో ఈ రాయితీ సిలిండర్ల సంఖ్యను 12 నుంచి 9కి కుదించారు. తాజాగా పశ్చిమాసియా సంక్షోభం నెపంతో 4కు తగ్గించారు. అలా మొత్తంగా ఏడాది వ్యవధిలో సిలిండర్ల రాయితీలో 66 శాతం మేర కోత విధించి పేదోడు మళ్లీ కట్టెల పొయ్యికి మళ్లే పరిస్థితిని కేంద్రం తీసుకొచ్చిందని విపక్ష నాయకులు మండిపడుతున్నారు.

## లోన్ యాప్ వేధింపులకు మరొకరు బలి

- వివాహిత ఆత్మహత్య

**టి మీడియా ,జూన్ 9, హైదరాబాద్ బ్యూరో :**



ఆన్‌లైన్ లోన్ యాప్ వేధింపులు మరో ప్రాణాన్ని బలితీసుకున్న ఘటన నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక ఓ యువ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మృతురాలు శివ దానపు దేవనందిని (25) స్వస్థలం కృష్ణా జిల్లా గణపవరం గ్రామం. 2022 నవంబర్ 8న పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమలకు చెందిన తిరుమల రేవంత్ కుమార్ అనే యువకుడిని ప్రేమ వివాహం చేసుకుంది. వివాహం అనంతరం దంపతులు హైదరాబాద్‌లోని నేరేడ్మెట్ పరిధిలో ఉన్న జేజే నగర్‌లోని ఎస్.ఎస్.బి. క్లాసిక్ అపార్ట్‌మెంట్లో గత మూడు సంవత్సరాలుగా నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 7వ తేదీన ఉదయం సుమారు 10 గంటల సమయంలో రేవంత్ కుమార్ పనిమీద బయటకు వెళ్లాడు. అనంతరం పలుమార్లు భార్యకు ఫోన్ చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో ఆందోళన చెందిన అతను ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని దేవనందిని వేలాడుతూ కనిపించింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు మృతురాలి మొబైల్ ఫోన్‌ను పరిశీలించారు. ప్రాథమిక విచారణలో దేవనందిని లోన్ యాప్ ద్వారా రుణం తీసుకున్నట్లు, ఆ రుణాన్ని తిరిగి చెల్లించకపోవడంతో లోన్ యాప్ నిర్వాహకులు నిరంతరం ఒత్తిడి, వేధింపులకు గురిచేసినట్లు గుర్తించారు. ఈ మానసిక ఒత్తిడిని భరించలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. మృతురాలి తండ్రి భీమవరపు వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరేడ్మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లోన్ యాప్ నిర్వాహకుల పాత్ర, వేధింపుల స్వరూపంపై పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు.

## నల్గొండ కాంగ్రెస్‌లో కోల్డ్‌వార్..

- ఫ్లెక్సీ చించివేతతో కొత్త వివాదం

**టి మీడియా ,జూన్ 9, నల్గొండ :**



నల్గొండ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చినట్లు కనిపిస్తున్నది. డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత జన్మదినం సందర్భంగా ఆయన అనుచరులు జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే వాటిలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫొటోలు లేకపోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో పున్న కైలాష్ అనుచరులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే చించివేయడంతో వివాదం మరింత ముదిరింది. ఈ ఘటన వెనుక కోమటిరెడ్డి అనుచరుల హస్తం ఉందని కైలాష్ వర్గీయులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్‌లో ఇప్పటికే వర్గపోరు కొనసాగుతుండగా.. తాజా ఘటన ఆ వివాదాలకు మరింత బలం చేకూర్చినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## తెలంగాణ రవాణా శాఖ కొత్త గైడ్ లైన్స్

- దరఖాస్తుదారులు తప్పనిసరిగా హాజరు

**టి మీడియా ,జూన్ 9, హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణవ్యాప్తంగా వివిధ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు, ఆర్.టి.ఓ. కార్యాలయాలలో దరఖాస్తుదారులు రాకుండానే లైసెన్సులు జారీ చేయడం, ప్రైవేట్ ఏజెంట్లతో కుమ్మక్కవడం, తనిఖీ అధికారుల రాకపై రహస్య కోడ్‌లు ఉపయోగించడం వంటి తీవ్ర అవకతవకలు జరుగుతున్నట్లు ఏసీబీ తనిఖీల్లో తేలింది. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటూ ఈ సూచనలు జారీ చేశారు. ప్రతి దరఖాస్తుదారు పరీక్ష రోజున కచ్చితంగా ప్రత్యక్షంగా హాజరు కావాలి. రాని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ లైసెన్స్ ఇవ్వకూడదు. ఎం వి ఐ ఇన్చార్జ్ పరీక్షకు ముందే ఆధార్ లేదా ప్రభుత్వ గుర్తింపు కార్డు ద్వారా అభ్యర్థిని స్వయంగా ధృవీకరించాలి. డ్రైవింగ్ టెస్ట్ మార్గాన్ని పూర్తిగా పూర్తి చేయాలి. కేవలం స్టీరింగ్ ముందుకు కూర్చోవడం లేదా కొద్ది దూరం నడపడంపై ఇకపై కుదరదు. వాహనాన్ని ఆపడం, వెనక్కి నడపడం, లేన్ క్రమశిక్షణ, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం వంటి సామర్థ్యాలను ప్రదర్శించాలి. పరీక్ష సమయంలో సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేస్తూనే ఉండాలి. ప్రతి పరీక్ష ముగియగానే ఫలితాలను రిజిస్టర్‌లో నమోదు చేసి, పరీక్షించిన అధికారి, ఇన్‌ఛార్జ్ సంతకాలు చేయాలి. బ్రోకర్లు, మధ్యవర్తులు, డ్రైవింగ్ స్కూల్ ప్రతినిధులను ట్రాక్ ప్రాంగణంలోకి అనుమతించకూడదు. ప్రవేశ ద్వారం వద్ద ఈ మేరకు నోటీసు బోర్డు పెట్టాలి. ఏజెంట్లతో చేతులు కలిపిన సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేస్తారు. సీనియర్ అధికారులు లేదా ఏసీబీ బృందాల రాకను ఒకరికొకరు హెచ్చరించుకునేందుకు ఎలాంటి రహస్య కోడ్‌లు, సంకేతాలు, నంబర్లను ఉపయోగించకూడదు. డిజిటల్, భౌతిక రికార్డులు రోజువారీగా సరిపోలాలి. తేడాలు ఉంటే ఆర్.టి.ఓ. కి నివేదించాలి. అలాగే ప్రతి నెల 15వ తేదీ లోపు రవాణా కమిషనర్ కార్యాలయానికి నెలవారీ కంప్లయెన్స్ నివేదికలు సమర్పించాలి. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే సంబంధిత ఉద్యోగులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయి.

# ఏపీకి వర్ష సూచన

- పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు!

**టి మీడియా ,జూన్ 9 , అమరావతి బ్యూరో :**

రాష్ట్రంలో ( మంగళవారం) పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**ఏ జిల్లాల్లో భారీ వర్షాలు?**

విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో కూడా అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.



**ఈదురుగాలులపై అప్రమత్తత అవసరం**

వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఆకస్మికంగా వర్షం ప్రారంభమైన సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ప్రకటనల హోర్డింగ్స్ సమీపంలో నిలబడకూడదని హెచ్చరించారు. గాలుల తీవ్రత కారణంగా కొమ్మలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత భవనాలు లేదా రక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

**రైతులు, పశుకాపరులకు సూచనలు**

పొలాల్లో పనిచేసే రైతులు, పశువులను మేపే కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే బహిరంగ ప్రదేశాలను విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. పిడుగుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, లోహ వస్తువులకు దూరంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అలాంటి వైర్లు కనిపిస్తే వాటికి సమీపించకుండా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధానమని, వాతావరణ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది.

**కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు**

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వడగాల్పుల ప్రభావం కూడా కొనసాగనుంది. ఈరోజు ( మంగళవారం) శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 10 మండలాలతో పాటు విజయనగరం జిల్లాలో 13, పార్వతీపురం మన్యం జిల్లాలో 6, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2, పోలవరం, కాకినాడ జిల్లాలో 8, పశ్చిమగోదావరి జిల్లాలో 2 మండలాలు, కృష్ణా జిల్లాలో 3 మండలాలతో పాటు ఏలూరు, ప్రకాశం, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఒక్కో మండలంలో తీవ్ర వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు తగినంత నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచించారు.

## ధరల నియంత్రణ చేయాలని సిపిఐ డిమాండ్

**టీ మీడియా, జూన్ 9, రామకృష్ణాపూర్:**



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పట్టణంలో ని సిపిఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం లో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ లు మాట్లాడుతూ పెంచిన గ్యాస్,డీజిల్,పెట్రోల్, నిత్యావసర ధరలు తగ్గించాలని ఈనెల 10 న మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుంది. ఈ ధర్నా కార్యక్రమం లో సిపిఐ పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజాసంఘాలు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలనీ కోరారు. అలాగే కేంద్రం లో నరేంద్ర మోడీ ప్రభుత్వం పెంచిన నిత్యవసర ధరలు సామాన్య ప్రజల పై భారం పడుతుంది అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వేంటనే స్పందించి ధరల నియంత్రణ చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య,జిల్లా సమితి సభ్యులు మిట్టపెల్లి పౌల్,మద్దెల శంకర్,మహిళ నాయకురాలు గాజుల మనక్క, నారెడ్ల కల్పన, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేరు యువకుడు కోచ్‌గా ఎంపిక

**టీ మీడియా, జూన్ 9 పెబ్బేరు:**



వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామానికి చెందిన కె జగదీష్ రెడ్డి అరుదైన ఘనత సాధించారు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఐసిసి లెవల్-3 కోచ్ అయిన ఆయన తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడుతున్న టి జి 20 లీగ్ ఫ్రాంచైజీ మెదక్ ఫాల్కన్స్ జట్టుకు ముఖ్య కోచ్‌గా నియమితులయ్యారు. జగదీశ్వర్ రెడ్డి కంచిరావుపల్లి గ్రామం నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించిప్పుడు స్టార్ ఆటగాళ్లతో కూడిన మెదక్ ఫాల్కన్స్ జట్టుకు ముఖ్య కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం జరిగింది .గ్రామీణ ప్రాంతాల యువత కూడా సరైన లక్ష్యం పట్టుదలతో కృషి చేస్తే అంతర్జాతీయ స్థాయికి చేరుకోవచ్చని జగదీష్ రెడ్డి తన విజయాలతో నిరూపిస్తున్నారని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి . మరింత ప్రాచుర్యం పొందాలని ఈ సందర్భంగా పెబ్బేరు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణకుమార్ రెడ్డి శంకర్ క్రికెట్ అకాడమీ కోచ్ శంకర్ ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు సాయికుమార్ గోవింద్ కాశి అసాద్ ఇర్ఫాన్ శ్రీను రవి తదితరులు కె జగదీష్ రెడ్డిని అభినందించారు .



## కొనసాగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పరీక్షలు

- మేడిగడ్డ వద్ద పురోగతిని పరిశీలించనున్న మంత్రి ఉత్తమ

**టి మీడియా ,జూన్ 9, హైదరాబాద్ బ్యూరో:**

కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టలకు సంబంధించిన పరీక్షలు కొనసాగుతున్నాయి. మొత్తం 13 రకాల పరీక్షలు పూర్తి చేయాల్సి ఉండగా, పునరుద్ధరణ డిజైన్ల కోసం అవసరమైన పరీక్షలను ఈ సీజన్‌లో పూర్తి చేసే దిశగా అధికారులు ముందుకెళ్తున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రేపు మేడిగడ్డ వద్ద పురోగతిని పరిశీలించడంతో పాటు సమీక్ష నిర్వహించనున్నారు.

**కొనసాగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పరీక్షలు**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద పరీక్షలు కొనసాగుతున్నాయి. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్?డీఎస్?ఏ) సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు చోట్లా అవసరమైన పరీక్షలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీడబ్ల్యూపీఆర్?ఎస్? ఆధ్వర్యంలో పరీక్షలు జరుగుతున్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రత, నిర్మాణ నాణ్యత, పునాది స్థిరత్వంపై మొత్తం 13 రకాల సాంకేతిక పరీక్షలు, అధ్యయనాలు జరుగుతున్నాయి.

**నెలాఖరులోగా పరీక్షలు పూర్తి చేయాలని గడువు**

కాంక్రీట్ నాణ్యత, స్ట్రక్చరల్ ఇంటెగ్రిటీని అధ్యయనం చేసేందుకు ఉద్దేశించిన ఎన్?డీటీ పరీక్షలు మూడు చోట్లా మొత్తం పూర్తయ్యాయి. గేట్ల మందం, స్థితిని అంచనా వేసే పరీక్షలు ఇంకా ప్రారంభం కాలేదు. వీటిని నెలాఖరులోగా పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు. బోర్‌హోల్ లాగింగ్ ద్వారా కాంక్రీట్ సాంద్రత, ఎలాస్టిసిటీ పరీక్షలు మూడు బ్యారేజీల్లో చేయాల్సి ఉంది. సీపేజ్ కారణాలు అన్వేషించి, విశ్లేషణ కోసం కీలకమైన జియో టెక్నికల్ అధ్యయనాలు కొనసాగుతున్నాయి.

**పరీక్షలు చేసే వాహనాల్లో సాంకేతిక సమస్యలు**

మేడిగడ్డలో 37 పరీక్షల్లో 20 పూర్తికాగా, అన్నారంలో 20లో 6, సుందిళ్లలో 24లో 14 పూర్తయ్యాయి. పునరుద్ధరణ డిజైన్ల కోసం ఈ పరీక్షలు కీలకంగా భావిస్తున్నారు. వర్షాలు ప్రారంభమయ్యేలోపు ఈ పరీక్షలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే పరీక్షల కోసం వినియోగిస్తున్న వాహనాలు, యంత్రాల్లో తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. అన్నారం వద్ద సమస్య అధికంగా ఉన్నట్లు సమాచారం.

**ఎక్కువ సంఖ్యలో వేయాల్సి ఉన్న బోర్ హోల్స్**

కాంక్రీట్ కోర్ నమూనాల సామర్థ్య పరీక్షలు ఇంకా ప్రారంభం కాలేదు. త్రీడీస్ట్రెస్ అనాలిసిస్ కోసం అవసరమైన సమాచార సేకరణ జరుగుతోంది. ఆగస్టు నెలాఖరు వరకు ఈ అధ్యయనం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సీకెంట్ పైల్స్ సామర్థ్యం నిర్ధారణ కోసం చేయాల్సిన జియో ఫిజికల్ పరీక్షలు ఇంకా ప్రారంభం కాలేదు. ఆనకట్టలకు ముందు, వెనక వైపు పెద్ద సంఖ్యలో బోర్ హోల్స్ వేసి క్రాస్‌హోల్, ప్యారలల్ సిస్మిక్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది.

ఈ తరహా ఒక్క మేడిగడ్డలోనే 417 బోర్ హోల్స్ వేయాల్సి ఉంటుంది. అన్నారంలో 162, సుందిళ్ల వద్ద 204 బోర్ హోల్స్ వేయాలి. ఎక్కువ సంఖ్యలో బోర్ హోల్స్ వేయాల్సి ఉన్నందున నీటి పారుదల శాఖ ఇంజనీర్లు ఈ విషయమై ఎన్?డీడబ్ల్యూడీఏ, సీడబ్ల్యూసీ అనుమతి కోసం చూస్తున్నారు. రాఫ్ట్ కింద ఎక్కడ రంధ్రాలు ఉన్నాయన్న విషయాన్ని తెలుసుకునేందుకు గ్రౌండ్ పెనెట్రేటింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ జియో ఫిజికల్ పరీక్షలు మేడిగడ్డలో 85కు గాను 63, అన్నారంలో 66కు గాను 53, సుందిళ్లలో 74కు గాను 52 పరీక్షలు పూర్తయ్యాయి.

నేల బలం, పీడన లక్షణాల పరీక్షలు ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయి. ఇందుకోసం సీపీటీయూ పరికరాల సమీకరణ జరుగుతోంది. వన్ డీ హైడ్రాలిక్ మోడల్ అధ్యయనాలు మేడిగడ్డ, అన్నారం వద్ద పూర్తి చేసి సీడబ్ల్యూపీఆర్?ఎస్?కు వివరాలు అందించారు. సుందిళ్ల డేటా సమర్పించాల్సి ఉంది. టూడీ హైడ్రాలిక్ మోడల్ అధ్యయనాలు కొనసాగుతున్నాయి.

## ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం

- డిప్యూటీ కలెక్టర్, సూపరింటెండెంట్ సస్పెండ్, మరొకరి డిస్మిస్

**టి మీడియా ,జూన్ 9, హైదరాబాద్ బ్యూరో :**



ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసిన ముగ్గురు అధికారులపై సర్కార్ కొరడా ఝుళిపించింది. డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రామునాయక్, సూపరింటెండెంట్ బోనానాయక్‌లను సస్పెండ్ చేసింది. మరో సూపరింటెండెంట్ వివేకానంద్‌ను పదేళ్ల సర్వీసు ఉండగానే డిస్మిస్ చేసింది. ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ భూములను పరాధీనం చేస్తూ చేసిన సేల్ డీడ్‌లను రద్దు చేయాలంటూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను మంత్రి ఆదేశించారు. హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పని చేసిన డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. 2013-2018 మధ్య ఆయన డిప్యూటేషన్‌పై పని చేసిన కాలంలో భారీ భూ అక్రమాలు, ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. హైకోర్టు 5 - 6 గేట్ల మధ్య ఉన్న 33.53 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆయన దారి మళ్లించినట్లు గుర్తించారు. 2018లో మాజీ గృహ నిర్మాణ బోర్డు వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇఫ్తికార్ అహ్మద్ భార్య సుబియా సుల్తానా పేరిట ఆ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారు. 2025 ఏప్రిల్‌లో ఆ భూమిని సుబియా సుల్తానా మరొకరికి విక్రయించినట్లు గుర్తించారు.

**ఇతరుల పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తింపు**

హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం స్థలాల గుర్తింపు ప్రక్రియ చేపట్టింది. ఈ క్రమంలో కొన్నిచోట్ల హౌసింగ్ బోర్డు భూములు అన్యాక్రాంతమైన విషయం వెలుగు చూసింది. వీటి వెనుక నాటి బీఎల్?వో, నేటి డిప్యూటీ కలెక్టర్ రామునాయక్ హస్తం ఉన్నట్లు గుర్తించారు. దీనిపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమగ్ర విచారణకు ఆదేశించడంతో అక్రమం వెలుగు చూసింది. విజయనగర్ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జాగూడలో 22 చదరపు గజాలు, లక్ష్మీగూడలో 130 చదరపు గజాలు, మహబూబ్ గంజ్‌లో 497 చదరపు గజాల స్థలాలను రామునాయిక్ ఇతరుల పేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు అధికారులు గుర్తించారు. ఈ అంశాల్లో కూడా రిజిస్ట్రేషన్లు చేసిన సబ్ రిజిస్ట్రార్ల పాత్ర, ఇతర అధికారులకు ఉన్న సంబంధాలపై విచారణ చేస్తున్నారు. రామునాయక్ భూ అక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకాంద్?ను డిస్మిస్ చేశారు. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

**ఎంత పలుకుబడి ఉన్నా కఠిన చర్యలు తప్పవు**

బీఆర్?ఎస్? హయాంలో ప్రభుత్వ భూములు భారీగా అన్యాక్రాంతమైనట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను అంగుళం ఆక్రమించేందుకు ప్రయత్నించినా, ప్రోత్సహించినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 2017 నుంచి రామునాయక్‌పై పలు కేసులు ఉన్నాయని, నాటి బీఆర్?ఎస్? పాలకులు, అధికారులు స్పందించలేదని తెలిపారు. వేగంగా విచారణ పూర్తి చేస్తామని, అన్ని ఆధారాలను నిర్ధారించిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రకటించారు. ఈ కేసుల్లో నాటి సబ్ రిజిస్ట్రార్ల పాత్రపై కూడా విచారణ నిర్వహించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారు ఏ హోదాలో ఉన్నా, ఎంత పలుకుబడి ఉన్న వ్యక్తులైనా కఠిన చర్యలు తప్పవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

## టీడీపీ రాజ్యసభ అభ్యర్థులందరూ కోటీశ్వరులే



- అఫిడవిట్లలో ఆసక్తికర అంశాలు

**టి మీడియా ,జూన్ 9 , అమరావతి బ్యూరో :**

రాజ్యసభ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరఫున బరిలోకి దిగిన అభ్యర్థుల అఫిడవిట్లు వారి వ్యక్తిగత, ఆర్థిక ముఖచిత్రాన్ని ఆసక్తికరంగా ఆవిష్కరించాయి. సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించిన ముగ్గురు అభ్యర్థులు.. భాష్యం రామకృష్ణ, సానా సతీష్‌బాబు, చింతకాయల విజయ్ తమ ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలను అధికారికంగా వెల్లడించారు. కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాలు, లగ్జరీ కార్లు, భారీగా బంగారు ఆభరణాలు కలిగిన ఈ నేతల ప్రస్థానంలో ఒకరి పేరిట వందల కోట్ల స్థిరాస్తులు ఉంటే, మరొకరికి సొంత ఇల్లే లేకపోవడం గమనార్హం.

**భాష్యం రామకృష్ణ: రూ. 672 కోట్ల సామ్రాజ్యం**

టీడీపీ అభ్యర్థుల్లో విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ అత్యంత సంపన్న అభ్యర్థిగా నిలిచారు. ఈయన కుటుంబ మొత్తం ఆస్తుల విలువ అక్షరాలా రూ.672.61 కోట్లు. ఇందులో అత్యధికంగా రూ.502.64 కోట్ల విలువైన స్థిరాస్తులు, వ్యవసాయ, వాణిజ్య, నివాస భవనాలు ఉండగా, కేవలం రామకృష్ణ ఒక్కరి పేరిటే రూ.454.95 కోట్ల ఆస్తులు కేంద్రీకృతమై ఉన్నాయి. వీరి కుటుంబ చరాస్తుల విలువ రూ.169.97 కోట్లు కాగా, అందులో వాహనాల విలువే రూ.18.37 కోట్లు కావడం విశేషం. ఇందులోనూ మెజారిటీ వాటాగా ఆయన కుమారుడు సాకేత్ రామ్ పేరిట రూ.18.14 కోట్ల విలువైన లగ్జరీ వాహనాలు ఉన్నాయి. రామకృష్ణ వద్ద రూ.2.20 కోట్ల విలువైన బంగారం, వెండితో పాటు 25 క్యారెట్ల ఖరీదైన వజ్రాలు ఉన్నాయి. వ్యాపార విస్తరణలో భాగంగా వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి ఈ కుటుంబం రూ.200.65 కోట్ల మేర రుణాలు తీసుకుంది. ఈయనపై హైదరాబాద్‌లో ఒక పాత వాహన ప్రమాదం కేసు మినహా ఇతర కేసులు లేవు.

**సానా సతీష్ బాబు: రూ.27 కోట్ల చరాస్తి.. కానీ సొంతిల్లు లేదు**

వ్యాపారవేత్తగా సుపరిచితులైన సానా సతీష్ బాబు దంపతుల ఆర్థిక ప్రయాణంలో ఓ విచిత్రమైన వైరుధ్యం కనిపిస్తుంది. వీరికి రూ.27.80 కోట్ల మేర భారీగా చరాస్తులు ఉన్నాయి. కియా ఈవీ 6, ఫార్చ్యూనర్, మెర్సిడెజ్ బెంజ్, ఇన్నోవా హైక్రాస్ వంటి విలాసవంతమైన వాహనాలు ఈ కుటుంబ గ్యారేజీలో ఉన్నాయి. దంపతులిద్దరి వద్ద కలిపి దాదాపు రూ.4.62 కోట్ల విలువైన 3,235 గ్రాముల బంగారం ఉంది. గత నాలుగేళ్లలోనే వీరి వార్షిక ఆదాయం రూ.6,170 (2020-21) నుంచి ఏకంగా రూ. 2.16 కోట్లకు (2024-25) పెరిగింది. ఇంతటి ఆర్థిక పరిపుష్టి ఉన్నప్పటికీ, వీరికి సొంతంగా ఒక్క నివాస గృహం కూడా లేకపోవడం విశేషం. కాకినాడలో భార్య నాగజ్యోతి పేరిట ఉన్న రూ.4.11 కోట్ల విలువైన ఒక ఎకరం భూమి మినహా మరే ఇతర స్థిరాస్తులూ వీరికి లేవు. కుటుంబానికి మొత్తం రూ.2.21 కోట్ల అప్పులు ఉండగా.. గతంలో ఢిల్లీ లో నమోదైన సీబీఐ, ఈడీ కేసులను అఫిడవిట్‌లో ప్రస్తావించారు. అయితే సీబీఐ కేసులో తనపై ఎలాంటి ఛార్జ్‌షీట్ దాఖలు కాలేదని, ఈడీ కేసుపై న్యాయపోరాటం చేస్తున్నట్లు సతీష్ స్పష్టం చేశారు.

**చింతకాయల విజయ్ ఆస్తి 38 కోట్లు**

ఉత్తరాంధ్ర సీనియర్ నేత అయ్యన్నపాత్రుడి కుమారుడైన చింతకాయల విజయ్ కుటుంబానికి రూ.38 కోట్ల మేర ఆస్తులు ఉన్నాయి. ఇందులో రూ.7.06 కోట్ల చరాస్తులు ఉండగా, దాదాపు రూ.31.58 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. అయితే ఈ స్థిరాస్తుల్లో విజయ్ పేరిట రూ.7.44 కోట్ల కంటే ఆయన భార్య డాక్టర్ సువర్ణ కుమారి పేరిటే అత్యధికంగా రూ.24.14 కోట్ల ఆస్తులు ఉండటం గమనార్హం. వీరి వద్ద సుమారు 1,940 గ్రాముల బంగారం, 38.5 కిలోల వెండి ఉన్నాయి. కుమార్తె పేరిట సుకన్య సమృద్ధి యోజనలో రూ. 5.14 లక్షలు పొదుపు చేశారు. ఈ కుటుంబానికి రూ. 16.91 కోట్ల అప్పులు ఉండగా, అందులో భార్య పేరిటే రూ. 13.94 కోట్లు ఉన్నాయి. ఇక రాజకీయాల విషయానికొస్తే.. గత ప్రభుత్వ హయాంలో విజయ్‌పై నమోదైన ఆరు క్రిమినల్ కేసులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

## లక్ష డాలర్ల హెచ్-1బీ ఫీజును కొట్టేసిన ఫెడరల్ కోర్టు

**తీర్పును స్వాగతించిన భారతీయ ప్రవాస సంఘాలు,**

**టి మీడియా ,జూన్ 9, ఢిల్లీ బ్యూరో :**

హెచ్-1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విధించిన లక్ష డాలర్ల ఫీజును ఫెడరల్ కోర్టు రద్దు చేయడాన్ని అమెరికాలోని ప్రవాస భారతీయుల సంఘాలు స్వాగతించాయి. ఈ నిర్ణయం వలస వ్యవస్థలో పారదర్శకతను కాపాడటంతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణ రంగాలకు మేలు చేస్తుందని పేర్కొన్నాయి. హెచ్-1బీ వీసాలపై ఆధారపడే వేలాది మంది భారతీయ నిపుణులు, అమెరికా సంస్థలకు ఈ తీర్పు ఊరటనిచ్చిందని అభిప్రాయపడ్డాయి. మసాచుసెట్స్ ఫెడరల్ కోర్టు ఇటీవల ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన 100,000 డాలర్ల హెచ్-1బీ ఫీజు నిర్ణయాన్ని చట్ట విరుద్ధమని ప్రకటించింది. కాంగ్రెస్ ఆమోదం లేకుండా ఇలాంటి భారీ ఫీజు లేదా పన్ను విధించే అధికారం అధ్యక్షుడికి లేదని కోర్టు స్పష్టం చేసింది. దీంతో గత ఏడాది సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

**నైపుణ్యవంతులైన ఉద్యోగులు అవసరం**

ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ పాలసీ అండ్ స్ట్రాటజీ చీఫ్ ఖండేరావ్ కంద్ మాట్లాడుతూ, కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ నిర్ణయం ఉపాధి ఆధారిత వలస వ్యవస్థలో స్థిరత్వం, న్యాయబద్ధతను పునరుద్ధరించిందన్నారు. అమెరికా సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, ఆధునిక తయారీ రంగాల అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నైపుణ్యవంతులైన ఉద్యోగులు అవసరమని చెప్పారు. అమెరికా పోటీ సామర్థ్యాన్ని నిలబెట్టుకోవడంలో విదేశీ ప్రతిభ కీలక పాత్ర పోషిస్తోందని ఖండేరావ్ కంద్ పేర్కొన్నారు. పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధి, అత్యాధునిక సాంకేతిక రంగాల పురోగతికి ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే ప్రతిభావంతుల సహకారం అవసరమన్నారు. ఇలాంటి సమయంలో హెచ్-1బీ వీసాలపై భారీ ఫీజు విధించడం వల్ల అమెరికా సంస్థలపైనే అదనపు భారం పడేదని అభిప్రాయపడ్డారు.




**హెచ్-1బీ విధానంపై చర్చలు**

అమెరికాలోని ప్రముఖ ప్రవాస భారతీయ సంస్థ ఇండియాస్పోరా కూడా ఈ తీర్పును స్వాగతించింది. ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా మాట్లాడుతూ, హెచ్-1బీ వీసాలకు సంబంధించిన ప్రతి వర్గం ఈ తీర్పుతో ఊరట పొందిందన్నారు. అయితే ఇది పూర్తిస్థాయి ముగింపు కాదని, భవిష్యత్తులో పరిపాలనా స్థాయిలో మరిన్ని మార్పులు వచ్చే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన విధాన లక్ష్యాలను సాధించేందుకు చట్టబద్ధ పరిధిలో ఇతర మార్గాలను అన్వేషించే అవకాశం ఉందని సంజీవ్ జోషిపురా పేర్కొన్నారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం, న్యాయవ్యవస్థ మధ్య చోటుచేసుకున్న వివిధ అంశాల వివాదాలను దృష్టిలో ఉంచుకుంటే, హెచ్-1బీ విధానంపై చర్చలు ఇంకా కొనసాగే అవకాశం ఉందన్నారు.

హెచ్-1బీ వీసా అమెరికాలో ప్రత్యేక నైపుణ్యం అవసరమైన ఉద్యోగాలకు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు ఉపయోగించే ప్రధాన వీసా విధానం. కనీసం బ్యాచిలర్ డిగ్రీ లేదా అంతకంటే ఉన్నత విద్యార్హత అవసరమైన ఉద్యోగాలకు ఈ వీసాలు జారీ చేస్తారు. ముఖ్యంగా ఐటీ, ఇంజినీరింగ్, వైద్య, పరిశోధన, ఆర్థిక సేవల రంగాల్లో హెచ్-1బీ వీసాదారులు కీలక పాత్ర పోషిస్తున్నారు. భారతీయులు ఈ వీసా కేటగిరీలో అత్యధిక సంఖ్యలో లబ్ధి పొందుతున్న వర్గంగా గుర్తింపు పొందారు. ప్రతి ఏడాది వేలాది మంది భారతీయ ఇంజినీర్లు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, డేటా సైంటిస్టులు, వైద్య రంగ నిపుణులు హెచ్-1బీ వీసాల ద్వారా అమెరికాలో ఉద్యోగాలు పొందుతున్నారు. అందువల్ల ఈ వీసా విధానంలో జరిగే ప్రతి మార్పు భారతీయులపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది.

**అమెరికన్ కార్మికులకు నష్టం**

గత ఏడాది సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం కొత్త హెచ్-1బీ పిటిషన్లపై లక్ష డాలర్ల ఫీజు విధిస్తున్నట్లు ప్రకటించింది. అమెరికన్ ఉద్యోగులను రక్షించడం, విదేశీ ఉద్యోగులపై కంపెనీల ఆధారపడటాన్ని తగ్గించడం దీని లక్ష్యమని తెలిపింది. కొంతమంది కంపెనీలు తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను నియమించుకుంటూ అమెరికన్ కార్మికులకు నష్టం కలిగిస్తున్నాయని ట్రంప్ వాదించారు. అయితే ఈ నిర్ణయాన్ని అమెరికాలోని పలు రాష్ట్రాలు, వ్యాపార సంస్థలు, వలస హక్కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ముఖ్యంగా విద్య, ఆరోగ్య, సాంకేతిక రంగాల్లో ఇప్పటికే నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉందని, ఇలాంటి భారీ ఫీజు కారణంగా పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని వాదించాయి. 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ కోర్టును ఆశ్రయించి ఈ నిర్ణయాన్ని సవాలు చేశారు. విచారణ అనంతరం కోర్టు ఈ ఫీజు వాస్తవానికి పన్నుతో సమానమని పేర్కొంది. కాంగ్రెస్ అనుమతి లేకుండా అధ్యక్షుడు స్వతంత్రంగా అలాంటి పన్ను విధించలేరని స్పష్టం చేసింది. దీంతో ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్ణయం అమాన్యమైంది. తాజా తీర్పుతో అమెరికాలో ఉద్యోగ అవకాశాలు ఆశిస్తున్న వేలాది మంది విదేశీ నిపుణులకు ఊరట లభించింది. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులు, అమెరికా కంపెనీలు, ప్రవాస భారతీయ సంఘాలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి.

## గోదావరిలో ముగ్గురు అన్నదమ్ముల గల్లంతు

**టీ మీడియా, జూన్ 9 ,హైదరాబాద్ :**



నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో అన్నదమ్ములు గల్లంతయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని కాచిగూడు చప్పల్ బజార్‌కు చెందిన సోదరులు చంద్రశేఖర్(38), రాంచందర్(36), మల్లేష్ కమార్(31) మండళవారం ఉదయం హైదరాబాద్ నుంచి బాసరకు వెళ్లారు. హైదరాబాద్ వార్తలుపుణ్యస్నానాల కోసం నదిలోకి దిగి గల్లంతయ్యారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాజన్న ఆలయ ఉద్యోగాలకు పరీక్షలు...

- హైదరాబాద్‌లో నిర్వహించిన అధికారులు

**టీ మీడియా, జూన్ 9 , వేములవాడ:**



వేములవాడ రాజన్న ఆలయంలోని పలు ఉద్యోగాలకు మంగళవారం నియామక పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉద్యోగ నియామకానికి కమిటీని నియమిస్తూ జీవోను ఉత్తరాలు జారీ చేశారు. అయితే రాజన్న ఆలయంలో వైష్ణవర్చక 2, తమ్మల అర్చక 2, బ్రాహ్మణ పరిచారిక 11, డోలు, సన్నాయి 5, బ్రాహ్మణ వంట మనిషి 1, తో కలిపి మొత్తం 21 ఉద్యోగ ఖాళీలు ఉండగా ఇందులో వైష్ణవ పరిచారికకు 7, తమ్మల పరిచారకకు 7, బ్రాహ్మణ పరిచారకకు 47, బ్రాహ్మణ వంట మనిషి ఉద్యోగానికి 5, డోలు 32, సన్నాయి, 22, శృతి 35 లతో కలిసి 155 మంది దరఖాస్తు చేసుకొని పరీక్షలకు హాజరయ్యారు. హైదరాబాద్ వార్తలు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ వ్రాత, పరీక్ష, మౌఖికంగా, పరీక్షలను నిర్వహించారు. హైదరాబాదులోని తుల్జా భవన్ ఈ ఉద్యోగ నియామకాలకు అధికారులు పరీక్షలు నిర్వహించగా వేములవాడ రాజన్న ఆలయ యువ రమాదేవితో పాటు పరిపాలన అధికారులు అక్కడికి వెళ్లి పర్యవేక్షించారు.

## మూడు వాహనాలు ఢీ..

- ఆరుగురు మృతి.. చిన్నారి సురక్షితం

**టీ మీడియా, జూన్ 9 , జల్‌గావ్ :**



మహారాష్ట్రలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మూడు వాహనాలు ఒకదానికి ఒకటి ఢీకొనడంతో ఆరుగురు ప్రయాణికులు మరణించారు. ఈ ఘటనలో ఒక చిన్నారిని అధికారులు రక్షించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇవి. మంగళవారం ఉదయం మహారాష్ట్ర, జల్‌గావ్ ప్రాంతంలోని అమాల్నేర్, ధూలె హైవేపై మాంగ్రూల్ గ్రామం వద్ద ఏడు గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గుజరాత్‌కు చెందిన ఒక కారు ఒక బైకును ఢీకొంది. ఆ వెంటనే మహారాష్ట్ర రవాణా శాఖకు చెందిన బస్సు ఈ రెండు వాహనాల్ని ఢీకొంది. ఇలా మూడు వాహనాలు ఢీకొన్నాయి. బైకు పూర్తిగా బస్సు కింద పడి నలిగిపోయింది. ఈ ప్రమాదంలో బైకుపై వెళ్తున్న ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. వీరిని నిలేష్ తవాడే, ఫల్గుణి భోయ్‌గా గుర్తించారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల్ని రక్షించేందుకు ప్రయత్నించాయి. ఈ క్రమంలో నలిగిపోయిన కారులోంచి ఒక చిన్నారిని బయటకు సురక్షితంగా తీశారు. పోలీసులు, స్థానికులు చాలా సేపు శ్రమించి చిన్నారిని రక్షించారు. అలాగే, నందలాల్ మహాజన్, అనితా మహాజన్, సురేష్ మహాజన్, నిర్మల అనే నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. కార్ డ్రైవర్ ఆదిత్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతడితోపాటు ఈ ప్రమాదంలో గాయపడిన మిగతవారిని సహాయక బృందాలు ఆస్పత్రికి తరలించాయి. బాధితులు ఒక వేడుక కోసం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులకు చికిత్స అందుతోందని పోలీసులు, వైద్యాధికారులు తెలిపారు. అలాగే, మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం తరలించామన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నెత్తురోడిన పాకిస్థాన్







## ఆక్రమిత కశ్మీర్- అల్లర్లలో 30 మందికిపైగా మృతి
## అవామీ యాక్షన్ కమిటీపై నిషేధానికి వ్యతిరేకంగా నిరసనలు

**టీ మీడియా, జూన్ 9, ఢిల్లీ బ్యూరో:**
పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ మరోసారి నెత్తురోడింది. స్థానిక అవామీ యాక్షన్ కమిటీ-పై నిషేధానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న పౌరులపై పాక్ సైన్యం మంగళవారం కాల్పులు జరిపింది. దీనితో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో పలువురు భద్రతాసిబ్బంది సహా మొత్తం 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, 200 మంది వరకు గాయాలపాలు అయ్యారని పాక్ ప్రభుత్వం తెలిపింది. అయితే మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని, పాక్? ప్రభుత్వం కావాలనే వివరాలను బయటకు రానివ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**సమస్యలపై పోరాడుతుంటే**

పాక్ ఆక్రమిత కశ్మీర్?లో పౌర సమాజ కూటమిగా ఏర్పడ్డ జేఏఏసీ పీవోకేలో ఆర్థిక, రాజకీయాలకు సంబంధించిన విషయాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. ముఖ్యంగా పీవోకేలో ఇంతకు ముందు జరిగిన హింసాత్మక ఘటనలు, ఇంటర్నెట్ నిలిపివేత, విద్యుత్ కొరత, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వనరుల దోపిడీ, రాజకీయ వివక్ష మొదలైన సమస్యలపై పోరాడుతోంది. ఈ క్రమంలోనే, జులై 27న పాక్ ఆక్రమిత కశ్మీర్? శాసనసభకు ఎన్నికలు నిర్వహించాలని పాక్ నిర్ణయించింది. అయితే ఈ శాసనసభలో ఉన్న మొత్తం 45 స్థానాల్లో 12 స్థానాలను పీవోకేకు చెందని పాక్ జాతీయులకు కేటాయిస్తూ (రిజర్వేషన్?)?? చట్టం చేసింది. దీని వల్ల స్థానికుల హక్కులు దెబ్బతింటాయంటూ ఉద్యమిస్తోంది. ఈ క్రమంలో ఆ సంస్థకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని పాక్ ఆరోపించింది. అక్కడితో ఆగకుండా ప్రజాశాంతి, భద్రతకు ముప్పు ఉందనే కారణం చూపిస్తూ గతవారం జేఏఏసీ సంస్థను నిషేధించింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు రోడ్లపైకి రావడంతో అల్లర్లు చెలరేగాయి.

**అలా అల్లర్లు ప్రారంభమయ్యాయ్?!**

ఈ క్రమంలో గత శుక్రవారం రాత్రి సైన్యం జరిపిన కాల్పుల్లో ఒక వ్యాపారి మరణించాడు. దీనితో పీవోకేలో ఒక్కసారిగా ఉద్రిక్తతలు పెరిగాయి. ఆదివారం రావల్?కోట్? నగరంలో సైన్యానికి, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీనిపై రావల్?కోట్? కమిషనర్? సర్దార్? వహీద్? ఖాన్? ఓ ప్రముఖ న్యూస్ ఏజెన్సీతో మాట్లాడుతూ, "పోలీసుల కాల్పుల్లో మరణించిన వ్యాపారి మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచాం. దీనిలో ఆ ఆసుపత్రి వెలుపల జేఏఏసీ మద్దతుదారులు భారీగా గుమిగూడారు. భద్రతా దళాలు వారిని చెదరగొట్టడానికి చూశాయి. దీనితో జేఏఏసీకు చెందిన కార్యకర్తలు ఆటోమేటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులు, ఇతర ఆయుధాలతో దాడులకు దిగారు. దీనిని అడ్డుకోవడానికి భద్రతా దళాలు కాల్పులు జరపడంతో ఆరుగురు నిరసనకారులు మరణించారు. ఆ తర్వాత పలువురిని అరెస్టు చేశారు" అని తెలిపారు.

**మమ్మల్ని అణచివేస్తున్నారు: జేఏఏసీ**

అయితే కమిషనర్? సర్దార్ వహీద్ ఖాన్? ప్రకటనను స్థానికులు, జేఏఏసీ మద్దతుదారులు ఖండించారు. పౌరుల మరణాల సంఖ్య ప్రభుత్వం చెబుతున్నదానికంటే చాలా ఎక్కువగా ఉంటుందని వారు అంటున్నారు. తమను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చడంపై మండిపడుతున్నారు. దీనిని వారు 'అణిచివేత చర్య'గా అభివర్ణిస్తున్నారు. తాము కేవలం చట్టబద్ధమైన రాజకీయ, ఆర్థిక హక్కుల కోసమే నిరసన తెలుపుతున్నామని చెబుతున్నారు. అయితే ఇటీవలి కాలంలో ఈ సంస్థ పలు హింసాత్మక నిరసనలను చేపట్టడం గమనార్హం.

**పాక్ చర్యలను ఖండించిన మానవ హక్కుల సంఘం**

కాగా, ఉగ్రవాద నిరోధక చట్టం కింద జేఏఏసీని నిషేధించడంపై పాకిస్థాన్ మానవ హక్కుల సంఘం (హెచ్?ఆర్?సీపీ) ఆందోళన వ్యక్తం చేసింది. భద్రతా దళాలు నిరసనకారులపై మితిమీరి బలప్రయోగం చేసిందని విమర్శించింది. వారిపై కాల్పులు జరపడాన్ని ఖండించింది. మరోవైపు పీవోకేలో జరిగిన అల్లర్లలో పౌరులు, భద్రతాధికారులు మరణించడంపై ఆవేదన వ్యక్తం చేసింది. కమ్యునికేషన్ బ్లాకౌట్స్? (ఇంటర్నెట్, ఫోన్? సేవలు నిలిపివేయడం)పై నిరసన వ్యక్తం చేసింది. మరోవైపు క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడానికి వీలైనంత త్వరగా ఒక వాస్తవ నిర్ధరణ కమిటీని పంపించనున్నట్లు హెచ్?ఆర్?సీపీ ప్రకటించింది.

**పాక్ తీరును ఎండగట్టిన భారత్**

పీవోకేలో మారణహోమం సృష్టించిన పాకిస్థాన్?పై భారత్ మంగళవారం? తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. తన వ్యవస్థీకృత వైఫల్యాలను, తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలను కప్పిపుచ్చుకోవడానికి ఇస్లామాబాద్? అసత్య ప్రచారాలను చేస్తోందని విమర్శించింది. పాక్? నుంచి వస్తున్న నకిలీ వార్తలను, అసత్య ప్రచారాలను మేము గమనిస్తూనే ఉన్నాం. పాకిస్థాన్ తన సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, మానవ హక్కుల ఉల్లంఘనల నుంచి దృష్టిని మరల్చడానికి చేస్తున్న నిరాశాజనకమైన ప్రయత్నం ఇది. పీవోకేలో పాక్ దళాలు జరిపిన కాల్పుల్లో పలువురు నిరసనకారులు మరణించగా, మరెంతో మంది తీవ్రంగా గాయపడినట్లు మాకు నివేదికలు వచ్చాయి. అందుకే అంతర్జాతీయ సమాజం పాక్ దుశ్చర్యలను, మానవ హక్కుల ఉల్లంఘనలను ఖండించాలని, ఇందుకు పాకిస్థాన్?ను జవాబుదారీ చేయాలని నేను కోరుతున్నాను" అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్? అన్నారు.



# రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించాం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**టి మీడియా ,జూన్ 9, హైదరాబాద్ బ్యూరో :** ధాన్యం సేకరణలో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించామన్న పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రూ.35,077 వేల కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. 65.91 లక్షల ఎకరాల్లో 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని, 52 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని కేంద్రం చెప్పిందని అన్నారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు : దేశంలో పండే వరిలో 61 శాతం తెలంగాణలోనే ఉందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పక్కరాష్ట్రం 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి మాత్రమే కొనుగోలు చేసిందని, యాసంగి పంటలో పక్క రాష్ట్రాలు తమ కన్నా తక్కువ కొన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని, రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని వివరించారు.

**ఉన్న ప్రతి వరి గింజను కొనుగోలు చేశాం**

20.86 కోట్ల గోనె సంచుల్లో 18 కోట్లు మాత్రమే ఉపయోగించామన్న మంత్రి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఈ యాసంగి పంటలోనే ఎక్కువగా ధాన్యం సేకరించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమ కన్నా తక్కువ ధాన్యం సేకరించిందని, బీజేపీ పాలిత రాష్ట్రంలో కూడా ఇంత వరి సేకరణ చేయలేదన్నారు. పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రూ.1.35 లక్షల కోట్లు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో రైతులకు రూ.లక్ష కోట్లు ఇచ్చిందని తెలిపారు. వరి సేకరణలో కేంద్రం ఇచ్చిన టార్గెట్ కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తక్కువ కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. కేంద్రం కోటా తగ్గించినా కొనుగోలు చేస్తున్నాం : కేంద్రం ఇచ్చిన టార్గెట్ కంటే ఎక్కువగానే వరి సేకరించామని, రైతుల వద్ద ఉన్న ప్రతి వరి గింజను కొనుగోలు చేశామని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి కొనుగోలు చేసే వరిని కేంద్రం ఏటా తగ్గిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెంచుతుంటే కేంద్ర మాత్రం కొనుగోలు చేయడం లేదని, కేంద్రం కోటా తగ్గించినా ఎంఎస్పీ ప్రకారం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.






# ఒక్కసారిగా ఎగసిపడిన ఉక్కుద్రవం

## బొగ్గులా మారిపోయిన మృతదేహాలు

**టి మీడియా ,జూన్ 9 ,విశాఖ :**
విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న ఘోర ప్రమాదం కార్మిక లోకాన్ని, విశాఖ నగరాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. విధుల్లో ఉన్న కార్మికుల సమక్షంలో లాడిల్ పేలిపోవడంతో ద్రవ ఉక్కు ఒక్కసారిగా చిమ్మి కార్మికులపై పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు శబ్దంతో కర్మాగారంలో భయాందోళనలు నెలకొనగా, కార్మికులు పరుగులు తీశారు.

కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు

ప్రమాద సమాచారం అందుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు ఉక్కు కర్మాగారం, ఆసుపత్రులకు చేరుకుని తమ వారి కోసం వెతికారు. గుర్తుపట్టలేని స్థితిలో మాడిపోయిన మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆరోపిస్తూ బాధిత కుటుంబాలు ఆందోళనకు దిగాయి. నష్టపరిహారంపై స్పష్టమైన హామీ ఇవ్వకపోతే పోస్టుమార్టం ప్రక్రియకు అనుమతించబోమని తేల్చిచెప్పడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

'హేతుబద్ధీకరణ' అధ్యయనమే కారణమా?

ప్రమాదం అనంతరం స్టీల్‌ప్లాంట్‌లో మానవ వనరుల కొరత, నిర్వహణ లోపాలు, ఉత్పత్తి లక్ష్యాల ఒత్తిడిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్రం ఇచ్చిన సమాధానంలో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి 9,510 మంది ఉద్యోగులు సరిపోతారని పేర్కొంది. ఖాళీలు లేవని చెప్పడాన్ని అప్పట్లోనే కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. ప్రస్తుతం అదే అధ్యయనం ప్లాంట్ భద్రతపై ప్రతికూల ప్రభావం చూపిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆ ఎనిమిది మంది ఎందుకు ప్రాణాలు కోల్పోయారు?

స్టీల్‌మెల్ట్ షాప్‌లో ద్రవరూపంలోని ఉక్కు ఉష్ణోగ్రత 1540 నుంచి 1630 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుంది. లాడిల్‌లోని 150 టన్నుల ద్రవ ఉక్కు ఒక్కసారిగా బయటకు చిమ్మడంతో మౌల్డ్ వద్ద విధులు నిర్వహిస్తున్న టెక్నీషియన్లు, కోఆర్డినేటర్లపై పడింది. అత్యంత అధిక ఉష్ణోగ్రత కారణంగా వారు తప్పించుకునే అవకాశం లేకుండాపోయిందని అధికారులు భావిస్తున్నారు.

నిర్వహణ లోపాలపై ఆరోపణలు

కేంద్రం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీని ప్రధానంగా రుణాల చెల్లింపులు, ముడిసరకుల కొనుగోళ్లకే వినియోగించి యంత్రాల నిర్వహణను నిర్లక్ష్యం చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కూలింగ్ ప్లేట్లు, కీలక విడిభాగాల కొరత ఉన్నప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. సింటర్ ప్లాంట్, ఎస్ఎంఎస్, కోక్ ఓవెన్ విభాగాల్లో ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగినప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదని పేర్కొంటున్నాయి.

సెయిల్‌తో పోలిస్తే ఉద్యోగుల కొరత?

సెయిల్ సంస్థలో 20 మిలియన్ టన్నుల ఉత్పత్తికి 55 వేల మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తుండగా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి కేవలం 9,500 మంది చాలని నిర్ణయించడం సరికాదని కార్మిక సంఘాలు వాదిస్తున్నాయి. ముఖ్యంగా విశాఖ ప్లాంట్‌లో 30 ఏళ్లకు పైబడిన యంత్రాలు అధికంగా ఉండటంతో నిర్వహణ, భద్రత కోసం మరింత మానవ వనరులు అవసరమని చెబుతున్నాయి.

మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం





ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని నగరంలోని ఎంజీఎం హెల్త్‌కేర్ ఆసుపత్రికి తరలించారు. గాజువాకకు చెందిన గొక్వాడ సూరిబాబుకు 90 శాతానికిపైగా కాలిన గాయాలయ్యాయి. గంగవరం ప్రాంతానికి చెందిన కందుల పైడిరాజు అధికంగా పొగ పీల్చడంతో పరిస్థితి విషమంగా ఉంది. 25 శాతం గాయాలతో పల్లెల శ్రీనివాసరావు చికిత్స పొందుతున్నారు.

శాసనసభ స్పీకర్ దిగ్భ్రాంతి

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. హోంమంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌తో మాట్లాడి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కూడా ఘటనపై విచారం వ్యక్తం చేసి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు

తరచూ చిన్నచిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, పాత యంత్రాలతో ఉత్పత్తిని కొనసాగించడం, సిబ్బంది కొరత వంటి అంశాలు తాజా దుర్ఘటనతో మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ప్రమాదానికి గల అసలు కారణాలపై విచారణ పూర్తయిన తర్వాతే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.